భట్టిప్రోలు నాగసుందరి స్మారక సంక్రాంతి కథల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన కథ

# కొత్త తరం

సిహెచ్.వి.బృందావనరావు

"ఇంకెంతకాలం ఏడిస్తే మాత్రం ఏమొస్తది. లేచి పనోపాడో చేసుకోవాలెగాని ఎన్నిరోజులు ఏడుస్తూ గూసుంటం" అంది ముత్యం ముక్కు ఎగబీలుస్తూ - సత్తెమ్మతో. ముత్యం సత్తెమ్మ, ఐలయ్యలకు ఒకే కూతురు. అప్పుడే పదిహేనురోజులయింది ఐలయ్య చనిపోయి. ప్రతిరోజూ కూలిపనికి పోయి ఐలయ్య నాలుగు రూపాయలు సంపాదించుకొస్తేనే ఆ యిల్లు గడిచేది. సత్తెమ్మ దబ్బుమనిషి. కూలికి పొయ్యేదిగాదు. ఐనా జాగ్రత్తపరురాలు గాబట్టి ఇల్లు గడవంగా రోజుకో రూపాయో, అర్థో మిగిలించి పెట్టేది. ఐలయ్య చనిపోయేసరికి ఆ కాపురం దిక్కులేనిదైపోయింది. సత్తెమ్మను సముదాయించడం ఎవరికీ చేతకావడంలేదు.

ముత్యానికి పదిహేడో ఏడు. పదోతరగతి చదువుతున్నది. "మనకు చదువులెందుకయ్యా. కూలికి పంపక" అనేది సత్తెమ్మ. కాని ఐలయ్యకు కూతురంటే ప్రేమ. "నా బంగారాన్ని కూలికి బంపుతనా. మనం ఓపూట తిండి మానుకొనైనా ముత్యాన్ని ఛదివించాల్సిందే" అనేవాడు. ఆ మాటలు మనసులోకొచ్చి దుఃఖం పొంగు కొచ్చింది ముత్యానికి. ఆమెకూ, తమ ప్రస్తుత పరిస్థితిని జూసి, కడుపులో బాధగానే వుంది. కాని కూలిపనీ నాలిపనీ చెయ్యనంతమాత్రాన కష్టసుఖాలు తెలియని పిల్లగాదు ముత్యం. చదువుకుంటనే ఇంటిపనంతా జేసేది. ఇల్లూడవడం, నీళ్ళు తోడడం, అంట్లు తోమడం, అన్నం వండడం తనే చకచకా చేసేది. పనులన్నీ ముగించుకొని తండ్రి కొనిచ్చిన డొక్కుసైకిలెక్కి స్కూలుకు పోయేది. మళ్ళీ ఇంటికి రాగానే సందె కసవు చిమ్మి - వంటలో తల్లికి సాయపడేది.

సైకిలు పంచరైతే తానే గిన్నెలో నీళ్ళుబోసి, టైరిప్పదీసి, ట్యూబు నీళ్ళలోబెట్టి, పంచరు కనిపెట్టి, సొల్యూషను పూసి, పంచరు వేసేది. చిన్న చిన్న రిపేర్లు తానే చేసుకునేది. ఇతరులకు చేసిపెట్టేది.

సత్తెమ్మకు ఇక ఇల్లెట్ల గడవాల అనే బాధతోపాటూ ముత్యానికి ఎట్టా పెళ్ళిజేసి పంపడమా అనే దిగులూ ఎక్కువైంది.

"ఆ మారాజు అట్టా అన్నాయంచేసి పాయ. నాకేమో ఈ ఉబ్బసందగ్గుతో ఏమీ జేయరాకపాయ. నువ్వేమో కూలికి ఏనాడూ బోకపోతివి. నేనే బాయిలో దూకాల. నిన్నే అయ్యచేతులో బెడదామంటే యాముంది నాకాడ. మొగోడనంగనే యేలేలు కట్నాలు గావాలాయ. యాణ్ణించీ దెచ్చి పొయ్యాల. అసలు మనకు బువ్వెట్ట గడవాల. సెరో సిప్ప దీసుకొని అడక్క దినాల్సిందేగదా. ఏం రోజులొచ్చినయిరా బగమంతుడా" అని ఏడ్చింది సత్తెమ్మ.

"ఎట్టనొట్ట బతుకుతంగాని, సస్తాసస్తానంటే యట్ట - లే, నువ్వు లోపలికి రా" అని తల్లిని గదిమింది ముత్యం.

"ఎట్ట బతకాల్నో శెప్పు. నాశాతగాదు. యేశెరువులోనో దూకుతా" అంటూ ఏడుపు కొనసాగించింది సత్తెమ్మ.

"ఛీ. సచ్చేట్టయితే సావు పో. నాకుమాత్రం బాదలేదా. ఒక మనిషి బోంగనే మిగిలినోళ్ళు జచ్చేట్టయితే, యీ లోకంలో మనిషనేటోడే వుండేవాడు గాదు. నువ్వు కండ్లుతుడుసుకో, ఇంటోకి రా" అని తల్లిని లాక్కొచ్చి మంచంమీద కూలేసింది ముత్యం.

రోజులు గడిచిపోతున్నాయి. ఇంట్లో వున్న రూపాయో అర్థో కర్చుపెట్టుకుంటూ కాలం గడుపుతున్నారు.

ఒక రోజు మధ్యాహ్నం వాండ్ల దూరపు బంధువొకాయన ఓ యువ కుణ్ణీ, ఓ ఆడమనిషినీ వెంట బెట్టుకొని వాళ్ళింటి కొచ్చాడు. సత్తెమ్మ వాండ్ల నాహ్వానించి కూచోబెట్టింది. "ముత్తెమా సుట్టాలొచ్చినారు. మంచినీళ్ళు దేయే" అని కేకేసింది. స్టీలు గ్లాసుల్లో మంచి నీళ్ళు దెచ్చి వాండ్ల కిచ్చింది ముత్యం. 'ముత్యమా బాగున్నవా" అన్నాడు వచ్చిన బంధువు. ఏదో జవాబిచ్చింది ముత్యం. మిగిలిన ఇద్దరూ ఎవరో, ఎందుకొచ్చారో ఆమెకు అర్థంగాలేదు.

"ఇదే నా కూతురు ముత్తెం. పదోతరగతి చదువుతున్నది. పదేడో ఏడు. పిల్లను జూస్కొండి. కట్నం మాత్రం నేనేమీ ఇయ్యలేను. ఇగ మియ్యిష్టం" అంది సత్తెమ్మ. అర్థమైంది ముత్యానికి వాండ్లెందుకొచ్చారో.

"అయ్యన్నీ నేను జెప్పినానులే. ఈ అబ్బాయి మీ ముత్యాన్ని స్కూలుకాడ జూసిండంట. వాండ్లమ్మనూ, నాయిన్నూ ఒప్పించినాడు. ఇదుగో ఈమే ఈ అబ్బాయి తల్లి. పిల్ల బాగుంటదనీ, పనిమంతురాలనీ - కట్నం దేముందిలే అనుకున్నారు. అదురుష్టమంటే నీదేనే ముత్తెమా" అన్నాడు ఆ బంధువు.

యువకుని తల్లిమాత్రం, పశువులను గురించి బాగా తెలిసిన రైతు జెర్సీగేదెను పరీక్షగా చూసినట్లు చూస్తూ, బాగా పాలిస్తుందా, ఆదాయమొస్తుందా

రాదా అని వివరంగా పరీక్షించినట్లు చూసింది. చూపులకు పిల్ల బాగానే వుంది. ముగ్గురు మనుషుల పనిని ఒంటిచేత్తో చేసే వుషారుంది. అన్నలమ్ముల్లేరు గాబట్టి బాదరబందీల్లేవు. పెండ్లయింతర్వాత తల్లితో సంబంధముండదు. కట్నం లేకపోతే ఏమిలే - అని ఆలోచిస్తున్నది. యువకుడు ముత్యాన్నే మురిపెంగా చూసు కుంటున్నాడు.

ఉన్నట్టుండి ముత్యం అడిగింది యువకుణ్ణి "పెండ్లయింతర్వాత నువ్వు ఈడకే వచ్చి నాతో ఉంటవా" అని. పెద్దాయన ఆశ్చర్యపోయినాడు. యువకుని తల్లి ప్రశ్నార్థకం ముఖం పెట్టింది. సత్తెమ్మ ఏదో అనబోతే ముత్యం వారించింది. యువకుడు "అదెట్లా గుదుర్తది. నువ్వు నాకాడికే రావడం దర్మం గదా. మా అమ్మకూ, నాయనకూ నేందప్ప ఎవురూ లేరు" అన్నాడు.

"మాయమ్మగ్గూడా నేందప్ప ఎవరూ లేరుగదా" అంది ముత్యం.

"ఆడపిల్లలు అమ్మనొదిలిపెట్టి రాలేమంటే పెండ్లిండ్లెట్లవుతయి" అంది యువకుని తల్లి.

"నాకు అన్నో తమ్ముడో వుంటేనో, మా అమ్మకు ఏమన్నా ఆస్తివుంటేనో మీరు జెప్పేది న్యాయమే. నేను పెండ్లి జేసుకొని పోతే మాయమ్మ బతుకేంది" అంది ముత్యం.

"నేం జస్తే జస్త, బతికితే బతుకుత. గుండెలమీదినుంచి నిన్నెట్లా దించు కోవాలా అని నేన్జస్తుంటే నువ్విట్ల అడ్డదిడ్డంగా మాట్లాడతవేంది" అంది సత్తెమ్మ.

ఎదుట మరో ముగ్గురు మనుషులున్నారనే ధ్యాసలేకుండా, తల్లితో స్థిరంగా అన్నది ముత్యం. "అమ్మా! నువ్వు దిక్కులేక అడుక్కొని తింటుంటే నేను మొగుడితో కాపరంజేసుకోగల్నా? అదేం గుదరదు. మనమేం జెయ్యాల్నో నేను కరారు జేసుకొనేవున్నా. ఇదిగో యిను. యాణ్ణో ఒక్కాడ అప్పు దీసుకొని రెండు సైకిళ్ళు కొందం. అద్దెకు తిప్పుకుందం. గాలి కొట్టడం, సిన్న రిపేర్లు - నేను జేయగల్ను. ఆ రకంగా రూపాయో అర్ధో వస్తది. రెండు లీటర్ల పాల్దీసుకుని మన వసారాలో టీ దుకానం బెడదం. నేం జేయగల్ను ఈ పన్లన్నీ. కష్టపడితే మనిద్దరికీ ఈ పల్లెల్లో తిండి యళ్ళకపోదు. ఇంక నా పెండ్లంటవా, నాతోటి ఈ ఇంటికొచ్చి, నాలాగే కష్టపడి, నాతోనే వుండే మొగోడు రాకపోడు. ఇయ్యాల కష్టమొచ్చిందని, నీ సావుకు నిన్నొదిలేసి నేను పెళ్ళి జేస్కొని పోతననుకున్నవా. తల్లిని గనిపెట్టుకొని వుండడానికి కొడుకైతే యేంది, కూతురైతే యేంది. నువ్వు నాకిట్టా పెండ్లి సంబందాలు దేబాకు. నాతోపాటు కష్టపడి, నా తల్లిని గూడ జూసుకునే మొగోడొచ్చినపుడే నా పెళ్ళవుద్ది" అన్నది ముత్యం.

సంపాదించే మగదిక్కు వున్నట్టుండి చనిపోయినా, క్రుంగిపోకుండా భవిష్యత్తును ధైర్యంగా ఎదుర్కోవడానికి సిద్ధమవడమే కాకుండా, తన సుఖంకోసం తల్లిని వదులుకోవడానికి ఇచ్ఛగించని - ఈ పదిహేడేళ్ళ ఆడపిల్లను - మానవతా విలువలను మన్నించే ధైర్యవంతురాలైన ఓ కొత్త తరానికి చెందిన సరికొత్త యువశక్తిని - ఆశ్చర్యంతో చూస్తూవుండిపోయింది సత్తెమ్మ. పెళ్ళి సంబంధం కోసం వచ్చిన ముగ్గురూ లేచి వెళ్ళిపోవడం ఆమె గమనించనే లేదు.

## పాఠకులకు విజ్ఞప్తి

ప్రతినెలా 10 వ తారీఖులోపు
చినుకు పత్రిక మీకు చేరకపోతే
మీ పోస్టాఫీసులో గాని, పోస్ట్‌మేన్‌ని గాని సంప్రదించండి.

## ఎవరికి ఫిర్యాదు చేయాలి!?

కపటం అనే పంకం అంటనిది
కలంకం అనే బూజు పట్టనిది
నిరతం కాంతులు విరజిమ్మేది
నిఖిల జగతిలో ఒకే ఒక్కటి
బోధనా వృత్తి !
బోధకుడు బాధితుడు కాకూడదు.
అతడు కాంక్షించేది విద్యార్థుల్నుంచి
దోసెడు ప్రేమ !
నెలసరిగా అందుకునే పిడికెడు జీతం !
అదనంగా నాలుగేళ్ళకోసారి
కోరుకున్న చోటికి బదిలీ !
గురువుకు మినహా ఏ ఉద్యోగికి
సమయపాలనా ఆంక్షలుండవు.
బోధనా సిబ్బందికి బదిలీలొచ్చాయంటే
మినిస్టీరియల్ సిబ్బందికి పండగే పండుగ !
అటెండర్, జూనియర్, సీనియర్, సూపరింటెండెంట్
అందరూ అధికారికి బ్రోకర్లే !
పోరాటంలో భాగంగా కౌన్సిలింగ్ సాధిస్తే
దానికీ తూట్లే !
సంఘబాధ్యులు సైతం
అధికారి కొండచిలువకు పొత్తిల్లుసర్ది
లోపాయికారి ఒప్పందాలకు తలొగ్గి
అనుయాయులకు రిటెన్షన్లు
అమాయకులకు అవుటాఫ్ స్టేషన్లా !
దున్నపోతుకు అధికార పీఠమిస్తే
దుడ్డెలను కుమ్మి పారేస్తుంది !
గమిడి గేదెను కలర్‌ఫోటో తీసినా
బ్లాక్ అండ్ వైట్‌లోనే దర్శనమిస్తుంది
నీతి నియమాల పట్టింపులు లెక్క లేనోడికి
హిప్పో, రీనో స్థాయి మందంలో తోలు బలిసినోడికి
పెయిల భయముంటుందా !!
విప్పుకున్నోడికి లేకున్నా
కప్పుకున్నోడికన్నా ఇజ్జతుండాలి.
కిందోడికి మీదోడికి దోచుకున్నదాంట్లో భాగమిచ్చి
దొరలే దొంగలై ఊళ్ళు పంచుకుంటే;
బాధితుడు ఎవరికి ఫిర్యాదు చేయాలి ?

- దేవి యాదగిరి